క్లుప్తంగా

11న శీత్లా పండుగ జరుపుకోవాలి


మాట్లాడుతున్న నవీన్ రాథోడ్

జూలూరుపాడు: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గిరిజన తండాల్లో బంజారాలు ఈనెల 11న సీత్లా భవానీ పండగను అంగరంగ వైభవంగా జరుపుకోవాలని సేవాలాల్ సేన జిల్లా ఉపాధ్యక్షుడు బానోత్ నవీన్ రాథోడ్ పిలుపునిచ్చారు. ఆదివారం జూలూరుపాడులో జరిగిన సేవాలాల్ సేన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బంజారుల సంస్కృతి, సంప్రదాయాలకు శీత్లా పండగ ప్రతీక అన్నారు. తండా ప్రజలను అమ్మ చల్లంగ చూడాలని, పాడిపంటలు బాగా పండాలని, పశు సంపద వృద్ధి చెందాలని ఈ పండగను జరుపుకుంటారన్నారు. కార్యక్రమంలో సేవాలాల్ సేన నాయకులు హర్యా నాయక్, సురేష్, భద్రు, వెంకటేష్, నాగరాజు, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడికి సన్మానం


నాగేశ్వరరావును సన్మానిస్తున్న విజయభాస్కర్‌రావు

పాల్వంచ: తెలంగాణ రాష్ట్ర హైకోర్టు అడ్వకేట్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పల్లె నాగేశ్వరరావును పాల్వంచకు చెందిన కేటీపీఎస్ ఉద్యోగి, జాతీయ మాల విద్యుత్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బూర్గుల విజయభాస్కర్ రావు ఆదివారం హైదరాబాద్‌లో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా విజయభాస్కర్ రావు మాట్లాడుతూ.. దళిత బిడ్డగా ఎన్నో కష్టాలు పడి ఎదిగి నేడు ఎంతోమందికి ఆదర్శంగా నిలిచారన్నారు. దాసరి నాగరాజు, కన్నా సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

లైటింగ్ అసోసియేషన్ ఎన్నిక


అన్వర్‌ను సన్మానిస్తున్న అసోసియేషన్ సభ్యులు

పాల్వంచ: పాల్వంచ సౌండ్స్, డెకరేషన్, లైటింగ్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ఎండీ.అన్వర్, ప్రధాన కార్యదర్శిగా కె.రవిలను ఎన్నుకున్నారు. ఆదివారం స్థానికంగా ఓ ఫంక్షన్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఉపాధ్యక్షుడిగా గుర్రం ప్రసాద్, జాయింట్ సెక్రటరీగా అంబటి వెంకట్, కోశాధికారిగా నంది వీరభద్రరావు, గౌరవ అధ్యక్షుడిగా కత్తి శ్రీను, పిచ్చెట్టి శ్రీనివాసరావు, గౌరవ సలహాదారులుగా ఎండి.ఖాజాలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు అన్వర్ మాట్లాడుతూ.. అసోసియేషన్ అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

కళ తప్పిన పాత పాల్వంచ

- ఎండ, వానకు నిలువ నీడ లేని వైనం
- పలు ప్రభుత్వ కార్యాలయాల తరలింపు
- అధికారులు, పాలకులు దృష్టి సారించాలని డిమాండ్

పాల్వంచ: నేడు పాల్వంచగా పిలువ బడుతున్న పట్టణంలో రెండుగా చీలింది. ఒకటి పాత పాల్వంచ, రెండు కొత్త పాల్వంచ. పాత పాల్వంచనే మొదటి నుంచి ఉండగా కేటీపీఎస్ ఏర్పడిన తర్వాత కొత్త పాల్వంచ వెలిసింది. నాడు పాత పాల్వంచలోనే మున్సిపాలిటీ కార్యాలయం, గ్రంథాలయం, ప్రభుత్వ వైద్యశాల ఇలా అనేక ప్రభుత్వ కార్యాలయాలకు నెలవుగా ఉండేది. రానురాను ఈ కార్యాలయాలన్నీ కొత్త పాల్వంచకు తరలిపోయాయి. ఇప్పుడు పాత పాల్వంచ అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. కొత్త పాల్వంచలో బస్టాండ్ ఉండగా, పాత పాల్వంచలో కనీసం బస్ షెల్టర్ కూడా లేదు. అతి పెద్ద విస్తీర్ణంతో ఉండే పాత పాల్వంచ కేంద్రంగా రోజువారీ అనేక మంది వివిధ ప్రాంతాలకు వెళ్లి వచ్చేందుకు బస్సులు, ఆటోల కోసం మెయిన్ రోడ్డుకు వచ్చి వేచి ఉంటారు. అక్కడ బస్సులు, లేక ఆటోల్లో ఎక్కి ప్రయాణం చేయాల్సి ఉంటుంది. పాత పాల్వంచ సెంటర్ నాటి కళ తప్పింది. ఈ సెంటర్‌ను దమ్మపేట, అంబేద్కర్ సెంటర్లను అభివృద్ధి చేసినట్లు ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అదేవిధంగా ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సైతం ఇక్కడే ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

బస్ షెల్టర్ లేక అవస్థలు..

పాత పాల్వంచ సెంటర్‌లో ఇప్పటి వరకు బస్టాప్ ఉన్నా షెల్టర్ లేదు. చిన్నపాటి షెడ్డు అయినా ఏర్పాటు చేయడంలో మున్సిపల్ అధికారులు, పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పాల్వంచ- కొత్తగూడెం పట్టణాలకు నిత్యం రాకపోకలతో రద్దీగా ఉంటుంది. ఉదయం సాయంత్రం వేళల్లో అత్యధిక సంఖ్యలో విద్యార్థులు కళాశాలలు, పాఠశాలలకు వెళ్లేందుకు, ఉద్యోగులు, ఇతర పనుల కోసం వెళ్లేవారు ప్రయాణించేందుకు రోడ్డు మీదకు వస్తే అక్కడ కనీసం నిలబడే స్థలం కూడా లేదు. పక్కనే ఉన్న పాన్‌షాపులు, కిరాణా షాపులు, హోటళ్ల ముందు నిలబడాల్సిన పరిస్థితి. ఎండకు, వానకు సరైన వసతి లేక వారి ఇబ్బందులు వర్ణనాతీతం. ఇంత పెద్ద పట్టణంగా పేరుగాంచిన పాత పాల్వంచ సెంటర్‌లో కనీస వసతులు లేకపోవడంతో స్థానికులు పెదవి విరుస్తున్నారు.


బోసిపోయిన పాత పాల్వంచ సెంటర్

కార్యాలయాలన్నీ తరలింపు...

రానురాను మార్కెట్ మొత్తం కొత్త పాల్వంచలో ఏర్పడటంతో పాత పాల్వంచ అభివృద్ధి కుంటుపడింది. గ్రామపంచాయతీ కార్యాలయం సైతం తీసేశారు. పశువైద్యశాల, గ్రంథాలయం, ఇలా పలు ప్రభుత్వ కార్యాలయాలన్నింటినీ కొత్త పాల్వంచకు తరలించారు. ఈ క్రమంలో పాత పాల్వంచ సెంటర్ కళా విహీనంగా మారింది. కనీసం బస్ షెల్టర్ అయినా తక్షణమే ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్రంలో సీనియర్ శాసనసభ్యుడు, నాలుగు విజయం సాధించిన స్థానిక ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు సొంత ఇల్లు జాతీయ రహదారిపై పాత పాల్వంచ సెంటర్‌కు అతి సమీపంలో ఉండడం గమనార్హం. ఇక దాతలు షెల్టర్ ఏర్పాటు చేస్తామని ముందుకొస్తుండగా అధికారులు స్థలం చూపించడం లేదని పలువురు వాపోతున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులో లేరు.


బస్సు కోసం పాన్‌షాపు ముందు నిల్చున్న విద్యార్థినులు

బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలి



పాత పాల్వంచ సెంటర్‌లో బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలి. ఈ ఏరియా వాసులు నిత్యం ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. ప్రయాణికులు రోడ్డు వద్దకు వచ్చి వేచి ఉండేందుకు కనీసం షెల్టర్ లేక ఇబ్బందులు పడుతున్నారు. ఎండ వేడిమికి, వర్షం కురిసినప్పుడు పాన్ షాపులు, ఇతర షాపుల వద్ద నిల్చోవాల్సి వస్తోంది. స్థానిక ఎమ్మెల్యే చర్యలు తీసుకోవాలి.

– పెరుమాళ్ల వెంకట కృష్ణ, పాత పాల్వంచ

అన్ని వసతులు కల్పించాలి



అధికారులు, పాలకులు పాత పాల్వంచ ప్రజల సమస్యను గుర్తించి వెంటనే బస్ షెల్టర్ నిర్మించాలి. ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాలు తరలి వెళ్లడంతో ఇక్కడ కళ తప్పింది. ఇక్కడ జంక్షన్‌లో పబ్లిక్‌కు అన్ని వసతులు కల్పించాలి. దమ్మపేట, అంబేద్కర్ సెంటర్లను అభివృద్ధి ఇక్కడ పట్టించుకోకపోవడం దారుణం. పలుమార్లు ఎమ్మెల్యేగా గెలుస్తున్న వనమా స్పందించాలి.

– సోములపల్లి శ్రీనివాస్, పాత పాల్వంచ

నారవేప చెట్లు మాయం

టేకులపల్లి: టేకు కంటే ప్రాధాన్యం ఉన్న నారవేప వృక్షాలకు రక్షణ కరువైంది. భద్రాచలం, ఇల్లెందు ఏజెన్సీలోనే ఈ వృక్షాలు అధికంగా ఉండటం విశేషం. టేకులపల్లి మండలంలో ఎర్రాయిగూడెం నుంచి కారేపల్లి తండా వరకు అటవీ ప్రాంతంలో ఈ వృక్షాలు పెద్ద మొత్తంలో విస్తరించి ఉన్నాయి. పంట పొలాల్లోనూ నారవేప చెట్లు ఉన్నాయి. ఈ కలపకు చెదలు పట్టదు.. టేకు కంటే బలమైంది కావడంతో వీటిని ఇంటి అవసరాలతో పాటు ఆలయాల్లో ప్రతిష్ఠించే ధ్వజస్తంభాలకు కూడా ఉపయోగిస్తుంటారు. సుమారు ఆరేళ్ల క్రితం వందల సంఖ్యలో ఈ ప్రాంతంలో ఈ వృక్షాలు నరికి అక్రమ రవాణా చేసిన సంఘటనలు ఉన్నాయి. వీటి సంరక్షణకు ఫారెస్టు అధికారులు అత్యంత ప్రాధాన్యం ఇస్తుంటారు. రెండు నెలల క్రితం సామ్యాతండా వద్ద, ఎర్రాయిగూడెం స్టేజీ సమీపంలోని పంట పొలాల్లో నారవేప చెట్లు నేలపై పడి ఉన్నాయి. ఒక చెట్టు అగ్నికి ఆహుతై కనిపించింది. చెట్లు నేలవాలి నెలలు గడుస్తున్నా సంబంధిత శాఖాధికారులు పట్టించుకున్న పాపాన పోవడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి నారవేప కలపను స్వాధీనం చేసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


ఎర్రాయిగూడెం వద్ద నేలవాలిన నారవేప చెట్టు

వెంకటేశ్వర్లు ఆశయాలను కొనసాగిద్దాం..


మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

టేకులపల్లి: తెలంగాణ రైతాంగ సమితి జిల్లా అధ్యక్షుడు కుంజా వెంకటేశ్వర్లు మరణం ప్రజా ఉద్యమాలకు, రైతాంగ పోరాటాలకు తీరని లోటు అని వివిధ ప్రజా సంఘాలు, పౌర సంఘం, రాజకీయ పార్టీలు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు అన్నారు. ముక్కంపాడులో ఆదివారం తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కుంజా వెంకటేశ్వర్లు సంతాప సభ మంతెన సంజీవరావు అధ్యక్షతన జరిగింది. మాట్లాడుతూ.. ఆదివాసీల మనుగడ కోసం ప్రజలను సమీకరించి ప్రజా ఉద్యమాలలో ధైర్యంగా కొనసాగాడన్నారు. ఆయన ఆశయాను కొనసాగించాలంటే నేడు ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలన్నారు. భవాని, జక్కుల వెంకటేశ్వర్లు, రడం శ్రీనివాస్, ఆవునూరి మధు, లక్కినేని సురేందర్‌రావు, మల్లెల రామనాథం పాల్గొన్నారు.

మున్నూరు కాపుల అభివృద్ధికి కృషి చేయాలి


నూతన కమిటీ సభ్యులు

టేకులపల్లి: మున్నూరు కాపుల అభివృద్ధికి కృషి చేయాలని మున్నూరు కాపు సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు లక్కినేని వెంకటేశ్వరరావు అన్నారు. ఈ మేరకు ఆదివారం కోయగూడెం గ్రామంలో కోయగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో నూతన కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడిగా గంగారపు మల్లయ్య, ప్రధాన కార్యదర్శిగా సంపటి వెంకన్న, ఉపాధ్యక్షుడిగా లింగాల ఉత్తరయ్య, రామిశెట్టి వీరయ్య, గొని వీరయ్య, జనరల్ సెక్రెటరీగా గంగారపు రమేష్, కోశాధికారిగా గంగారపు మనోజ్ఞను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కేసు నమోదు

ఇల్లెందు: దాడి ఘటనపై స్థానిక పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు అయింది. ఏఎస్ఐ ఘనీ తెలిపిన వివరాలు.. 14 నెంబర్ బస్తీకి చెందిన రాంకుమారి పాసీ అనే మహిళపై అదే ఏరియాకు చెందిన స్వేచ్ఛా పాసీ దాడి చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

భక్తులకు ఇబ్బందిగా మట్టి కుప్పలు


మట్టి కుప్పల్లోనే వంట చేస్తున్న భక్తులు

పాల్వంచరూరల్: మట్టికుప్పలు భక్తులకు ఇబ్బందికరంగా మారినా ఎవరూ పట్టించుకోవడం లేదు. మండల పరిధిలోని పెద్దమ్మతల్లి ఆలయం ఎదుట చెట్ల కింద నెలరోజుల క్రితం మట్టి కుప్పలు పోసి వాటిని చదును చేయకుండా నిర్లక్ష్యంగా వదిలేశారు. దీంతో భక్తులకు ఇబ్బందికరంగా మారింది. ప్రతి ఆదివారం జిల్లా నలుమూలల నుంచి భక్తులు అమ్మవారి దర్శనం కోసం అధిక సంఖ్యలో వస్తుంటారు. అమ్మవారిని దర్శించుకుని ఆలయం ఎదురుగా ఉన్న చెట్ల కింద నైవేద్యం, వంటలు వండుకుంటున్నారు. రోజంతా రద్దీ ఉంటుంది. అయితే చెట్ల కింద మట్టి కుప్పలను ఆలయ నిర్వాహకులు దీనిని పట్టించుకోవడం లేదు. ఆదివారం చెట్ల కింద వంటలు వండుకునే భక్తులకు జాగా లేక కూర్చునేందుకు అవస్థలు పడ్డారు. ఇప్పటికైనా ఈఓ స్పందించి చెట్ల కింద ఉన్న మట్టి కుప్పలను చదును చేయాలని భక్తులు కోరుతున్నారు.

ఆషాఢ బోనం ఎత్తిన మహిళలు

ఇల్లెందు: ఆషాఢ మాసం సందర్భంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో బోనాల పండగను ఘనంగా నిర్వహించారు. నెంబర్–2 బస్తీ, 14 నెంబర్ బస్తీ, లలిత్ కళామందిర్ ఏరియా, చెరువు కట్ట ఏరియాకు చెందిన మహిళలు పెద్దఎత్తున బోనాలను ఎత్తుకొని ఊరేగింపుగా పాత ఇల్లెందులోని కాళీమాత ఆలయం, చెరువు కట్ట ఏరియాలోని పెద్దమ్మతల్లి ప్రత్యేక పూజలు చేసి బోనాలు సమర్పించారు. వర్షాలు బాగా కురువాలని, పంటలు సమృద్ధిగా పండాలని అమ్మవారిని వేడుకున్నారు.

జూలూరుపాడు: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకైన బోనాల పండగను జూలూరుపాడు గ్రామ ప్రజలు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. గ్రామ ఆడపడుచులు, మహిళలు బోనాలతో శ్రీకోటమైసమ్మ తల్లిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా భక్తులు తమ ఇళ్ల వద్ద కొత్తకుండ, రాగి, ఇత్తడి పాత్రల్లో బియ్యం, పప్పు, బెల్లం, పసుపుతో కలిపి వండిన బోనం(నైవేద్యం), బోనం పాత్ర చుట్టూ పసుపు రాసి, కుంకమ బొట్లు పెట్టి వేపాకులు కట్టి అలంకరించారు. బోనాన్ని తలపై పెట్టుకొని మేళ తాళలతో ఊరేగింపుగా శ్రీకోటమైసమ్మ ఆలయానికి చేరుకుని అమ్మవారికి సమర్పించారు. యువకులు బాణా సంచా కాలుస్తూ నృత్యాలు చేస్తూ ఊరేగింపులో సందడి చేశారు. పోతురాజు వేషధారణలో ఎస్కే గౌస్ ముస్లిం యువకుడు నృత్యాలు చేయడం విశేషం.

టేకులపల్లి: మండలంలో ఆదివారం ఆషాఢ బోనాల పండగ ఘనంగా జరుపుకున్నారు. సులానగర్, తూర్పుగూడెం, రోళ్లపాడు క్రాస్‌రోడ్డులోని కాళీమాత ఆలయంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో మహిళలు, యువతులు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి ముత్యాలమ్మ, గ్రామ దేవతలకు బోనాలు సమర్పించారు.

ఇల్లెందురూరల్: మండలంలోని 21పిట్ ఏరియా మహిళలు పెద్దమ్మతల్లి ఆషాడం బోనాల మహోత్సవాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. మహిళలంతా ప్రదర్శనగా పెద్దమ్మతల్లి ఆలయానికి చేరుకున్నారు. పలువురిని అమ్మవారు ఆవహించడంతో పలుకులు పలికారు. స్థానికులు ఆసక్తిగా ఆలకించారు. మహిళలు అమ్మవారి గర్భగుడి చుట్టూ ప్రదక్షిణలు చేసి బోనం చెల్లించుకున్నారు.


టేకులపల్లి: తూర్పుగూడెంలో బోనాలతో మహిళలు


ఇల్లెందు: బోనాలతో వస్తున్న మహిళలు


జూలూరుపాడులో...


ఇల్లెందురూరల్: బోనాలతో ఏరియా మహిళలు

కాంట్రాక్ట్ కార్మికుల జీతాలు పెంచండి

సింగరేణి(కొత్తగూడెం): రాష్ట్ర వ్యాపితంగా మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కాంట్రాక్ట్ కార్మికలకు జీఓ 60 ప్రకారం వేతనాలు పెంచారని అదేవిధంగా సింగరేణిలో వివిధ విభాగాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు జీతాలు పెంచాలని టీబీజీకేఎస్ 11 మెన్ కమిటీ సభ్యులు కాపు కృష్ణ కోరారు. ఈ మేరకు ఆదివారం కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ఆయన స్వగృహంలో కలిసి కార్మికుల సమస్యలపై చర్చించారు. ఈ సందర్బగా కృష్ణ మాట్లాడుతూ.. అందరికీ వైద్య సౌకర్యం, పండుగ డ్యూటీలు చేస్తే వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలని, సింగరేణికి చెందిన ఖాళీ క్వార్టర్లను వారికి కేటాయించాలని కోరారు. సింగరేణి వ్యాప్తంగా సుమారు 32 వేల మంది కార్మికులు వివిధ విభాగాలలో పనిచేస్తూ చాలీచాలని జీతాలతో దుర్భర జీవితాలను అనుభవిస్తున్నట్లు చెప్పారు. ఈ విషయంపై సీఎం కేసీఆర్‌తో చర్చించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్, టీబీజీకెఎస్ నాయకులు, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేకు సమస్యలు వివరిస్తున్న కాపు కృష్ణ

చట్ట ప్రకారం పోడు పట్టాలివ్వాలి


మాట్లాడుతున్న కల్తి వెంకటేశ్వర్లు

టేకులపల్లి: పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, ప్రభుత్వ పథకాలను అందరికీ వర్తింపజేయాలని కోరుతూ ఈనెల 11న ఇల్లందులోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌజ్ నుంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వరకు జరిగే ప్రదర్శనను జయప్రదం చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ టేకులపల్లి సబ్ డివిజన్ కార్యదర్శి కల్తి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కరపత్రాలు ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. అటవీ హక్కుల చట్టం ప్రకారం పట్టాలు ఇవ్వాలని, దళిత, గిరిజన, బీసీ, మైనార్టీ బంధు పథకాలు అమలు చేయాలని, దళితులకు మూడెకరాల భూమి ఇవ్వాలని కోరుతూ ఈ ర్యాలీ జరుగుతుందని తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వం తెలంగాణ సెంటిమెంటును వాడుకోవడం తప్ప, పేద ప్రజలకి ఒరిగిందేమీ లేదన్నారు. తాతల ముత్తాతల నుండి సాగు చేసుకుంటున్న పోడు భూములకి పట్టాలు ఇవ్వకుండా గిరిజనులకు, గిరిజనేతరులకు ఆశ పెడుతున్నాడని విమర్శించారు. కార్యక్రమంలో గొగ్గల రాజు, చాపల వెంకటేశ్వర్లు, గోపి పాయం, రాములు, గొగ్గల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా ఇసుక అక్రమ రవాణా..

టేకులపల్లి: అధికారుల నిర్లక్ష్యం కారణంగా దళారులు ఇష్టారాజ్యంగా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తూ రూ.లక్షలు సొమ్ము చేసుకుంటున్నారు. గతంలో శంభునిగూడెం రీచ్ నుంచి ఇసుక రవాణాకు అనుమతి ఉండేది. ప్రస్తుతం అనుమతి లేదు. తోడుకున్నోళ్లకు తోడుకున్నంత అన్నట్లు ఇసుక దళారులు ముర్రేడు వాగు నుంచి యథేచ్ఛగా ఇసుకను తోడి ట్రాక్టర్ల ద్వారా రవాణా చేసి గుట్టు చప్పుడు కాకుండా అమ్ముకుంటున్నారు. చంద్రుతండా నుంచి మేళ్లమడుగు సమీపంలోని ముర్రేడు వాగు నుంచి, గుండ్లమడుగు సమీపంలోని ముర్రేడు వాగు నుంచి ప్రతిరోజూ వందల సంఖ్యలో ట్రాక్టర్లు ఇసుకను రవాణా చేస్తున్నాయి. ఉదయం ఇసుకను తెచ్చి సూర్యతండా పాఠశాల ఆవరణలో, గోప్యాతండా రోడ్డు పక్కన, మరికొన్ని చోట్ల డంప్ చేసుకుంటున్నారు. రాత్రి కాగానే చంద్రుతండా బొమ్మనపల్లి, రాజుతండా, సులానగర్, ముత్యాలంపాడు క్రాస్‌రోడ్డు, కోయగూడెం, చుక్కాలబోడు, టేకులపల్లి పోలీసు స్టేషన్ మీదుగా ఇల్లెందు, ఇతర ప్రాంతాలకూ రవాణా చేస్తున్నారు. ప్రధాన రహదారుల గుండానే వెళ్తున్నప్పటికీ సంబంధిత శాఖాధికారులకు కనిపించకపోవడం గమనార్హం.

అతి వేగంతో స్థానికుల ఆందోళన...

శంభునిగూడెం నుంచి బొమ్మనపల్లి వరకు ఇసుక ట్రాక్టర్లు ఓవర్ స్పీడ్‌తో ఇష్టారాజ్యంగా వెళ్తుండటంతో స్థానికులు బెంబేలెత్తుతున్నారు. ట్రాక్టర్ల రాకపోకలకు, హారన్లకు ఇంట్లో నిద్ర కూడా పట్టడం లేదని స్థానికులు వాపోతున్నారు. గతంలో పలుమార్లు మండల, జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. ఇసుక అక్రమ రవాణాను నియంత్రించాల్సిన అధికారులు మాత్రం.. మా దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటామని చెబుతున్నారే కానీ.. వారి కళ్ల ముందే ఇసుక ట్రాక్టర్లు వెళ్తున్నా పట్టించుకోకపోవడం పట్ల పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇదిలా ఉండగా ఇసుక దళారులు ప్రతినెలా టేకులపల్లి పోలీసు స్టేషన్ వద్ద కనిపిస్తుండటం గమనార్హం.


సూర్యాతండాలో ఇసుక లోడ్‌తో ట్రాక్టర్

జీపీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి


ఇల్లెందురూరల్: నిరసన తెలుపుతున్న జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య


సుజాతనగర్: మాట్లాడుతున్న ఎడవల్లి కృష్ణ

చుంచుపల్లి: రాష్ట్ర వ్యాప్తంగా జేఏసీ పిలుపులో పంచాయతీ కార్మికుల సమ్మె ఆదివారం నాలుగో రోజు కొనసాగింది. కొత్తగూడెం బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సమ్మె శిబిరాన్ని జిల్లా జేఏసీ కోకన్వీనర్ దుంపల అమర్‌నాథ్ సందర్శించారు. మాట్లాడుతూ.. సమ్మె చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులను పర్మనెంట్ చేయాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కిషోర్ కుమార్, సురేష్ కుమార్, బండా రామకృష్ణ, వంశీ, సరోజ, రవి, వెంకన్న, షరీఫ్ సలీం, సుబ్బారావు, అనిల్, సమ్మయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సుజాతనగర్: గ్రామ పంచాయితీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని టీపీసీసీ జనరల్ సెక్రటరీ ఎడవల్లి కృష్ణ డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మె ఆదివారం నాలుగో రోజు కొనసాగింది. సమ్మె శిబిరాన్ని ఎడవల్లి కృష్ణ సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి వేల్పుల భాస్కర్, గడ్డం రాజేందర్, మధు, ఉపేందర్, సురేష్, శ్రీను, పవన్, చంటి, ఉదయ్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: గ్రామపంచాయతీ కార్మికులను పర్మనెంట్ చేయాలని సీపీఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్ ఎదుట నాలుగు రోజులుగా సమ్మె చేస్తున్న శిబిరాన్ని ఆదివారం ఆయన సందర్శించి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. చంచలపురి శ్రీను, రెడ్డిమళ్ల బిక్షం, బానోతు తులసిరాం, బోడ భద్రు, డేరంగుల చిట్టిబాబు తదితరులు దీక్షలో కూర్చున్నారు.

ఇల్లెందురూరల్: గ్రామపంచాయతీ కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మెకు జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య, బీఎస్పీ నాయకులు ఆదివారం మద్దతు ప్రకటించారు. మాట్లాడుతూ.. కనకయ్య పంచాయతీ కార్మికులకు కనీస వేతన హక్కు చట్టం వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. జటంగి వెంకన్న, సారంగపాణి, యాకూబ్‌పాషా, రాంసింగ్, జటంగి వెంకన్న, మోహన్‌రావు, సామేలు, బోళ్ల సూర్యం, శారద, శ్రీను, ప్రతాప్‌నాయక్, రాయల శ్రీనివాస్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

వెలగని వీధి దీపాలు

స్థానిక సీపీఎం ఏరియాలోని వీధిలైట్లు కొన్ని రోజులుగా వెలగకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అసలే వానాకాలం స్థానికులు అత్యవసర పరిస్థితిలో రాత్రివేళల్లో బయటకు వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి వీధిదీపాలు వెలిగేలా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు. - సుజాతనగర్

ప్రశ్నించాల్సిన అధికారి : బి.నరేందర్,
పంచాయతీ కార్యదర్శి, సుజాతనగర్
ఫోన్ నెంబర్: 8885377753

